ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు ఏడు, ఎనిమిది, తొమ్మిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల ఎంఈ, ఎంటెక్ కోర్సుల రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, మూడో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ కోర్సుల పరీక్షల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీకామ్, బీఎస్సీ తదితర కోర్సుల మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్ఆర్‌నగర్ వాసులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ

కాలనీవాసులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జనవరి 9: ఎస్ఆర్‌నగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఎస్ఆర్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం తరఫున రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో తలసాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలనీ సంఘం ప్రతినిధులు కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఆర్‌నగర్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామని గుర్తు చేశారు. డ్రైనేజీ, విద్యుత్, రహదారులు, 50 పడకల ఆసుపత్రి, ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వంటి భారీ నిర్మాణాలను చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. అభివృద్ధి అనేది నిరంతరాయంగా సాగాల్సిన ప్రక్రియ కావడంతో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సంక్రాంతి పండుగ తరువాత అధికారులతో కలిసి కాలనీలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. తమ కాలనీ సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే తలసానికి సంఘం ప్రతినిధులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నరేందర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, వివేక్‌నాథ్, అమర్‌నాథ్‌రెడ్డి, రోజారెడ్డి, స్టీవెన్, డేవిడ్‌రాజ్‌తో పాటు అమీర్‌పేట బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజం విభాగం విద్యార్థుల ఫీల్డ్ విజిట్

ఫీల్డ్ విజిట్‌లో కార్యక్రమ నిర్వహణ విధానాన్ని వీక్షిస్తున్న జర్నలిజం విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం మొదటి, మూడో సెమిస్టర్ విద్యార్థులు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా రామోజీ ఫిలిం సిటీలోని ఈటీవీ, ఈటీవీ భారత్ డిజిటల్, ఈఎఫ్ఎం రేడియో కార్యాలయాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆయా విభాగాలు ఎలా పనిచేస్తాయో అక్కడి సిబ్బంది వివరించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మీడియా తీరుతెన్నులను తెలుసుకోగలుగుతారని పలువురు అభిప్రాయపడ్డారు. ఎన్నో విషయాలను తెలుసుకున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థులు విభాగం హెడ్ డాక్టర్ టి.సతీశ్‌కుమార్, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రామస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

కలుషిత నీటి సరఫరా పరిష్కారానికి చర్యలు

నామాలగుండులో అధికారులతో కలిసి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, జనవరి 9: కలుషిత నీటి సరఫరా సమస్య పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. డివిజన్ పరిధిలోని నామాలగుండులో తాగునీరు కలుషితం అవుతుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యపై వెంటనే స్పందించిన ఆమె అధికారులతో కలిసి ఆప్రాంతంలో పర్యటించారు. వాటర్ లైన్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. సమస్య త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ నూతన డ్రాఫ్ట్ ప్రతుల దహనం

యూజీసీ డ్రాఫ్ట్ ప్రతులతో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: దేశవ్యాప్తంగా వర్సిటీల్లో అధ్యాపకుల నియామకం, ప్రమోషన్లు, వీసీ నియామకం కోసం అర్హతలు, నిబంధనలను మారుస్తూ యూజీసీ విడుదల చేసిన నూతన డ్రాఫ్ట్ ప్రతులను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి గురువారం మాట్లాడుతూ ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణ కోసం ప్రతిఒక్కరూ ఆ నిబంధనలు తిరస్కరించాలని కోరారు. నూతన ప్రతిపాదిత నిబంధనల ప్రకారం 55 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసిన వారు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎలాంటి అకాడమిక్ విద్యార్హతలు లేని వారు వీసీగా నియమించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. యూజీసీలో ప్రతి ఆరు నెలలకు నిబంధనలు ఎందుకు మారుస్తున్నారని ప్రశ్నించారు. నూతన నిబంధనల వల్ల వర్సిటీల స్వయంప్రతిపత్తి దెబ్బ తింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో ఇలాంటి మార్పులు చేస్తే దేశంలో అశాస్త్రీయమైన భావనలు భవిష్యత్తులో ఏర్పడుతాయని వాపోయారు. ఈ మార్గదర్శకాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓయూ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రవినాయక్, నాయకులు ఉదయ్‌కుమార్, కృష్ణ, మల్సూర్, అజయ్‌కుమార్, సహజ, స్పందన, సందీప్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

అపార ప్రజ్ఞావంతుడు పింగళి

ముషీరాబాద్, జనవరి 9: నాటక పరిశోధన రంగం, సాహితీ ప్రక్రియల్లో అపార ప్రజ్ఞావంతుడు పింగళి లక్ష్మీకాంతం అని గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో ఎందరో మహానుభావులు మధుర స్మృతుల్లో భాగంగా గురువారం ప్రసిద్ధ తెలుగు కవి, నటుడు పింగళి లక్ష్మీకాంతం సంస్మర సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కవి పింగళి లక్ష్మీకాంతం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింగళి లక్ష్మీకాంతం సమగ్ర వాఙ్మయ మూర్తి అని, తెలుగు భాష అభివృద్ధికి విశేషంగా కృషిచేశాడని అన్నారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత తుమ్మళపల్లి రామ సత్యనారాయణ, పీఎస్ఆర్ మూర్తి, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఆయాచితం శ్రీధర్

పెరిక కుల ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఓయూ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంతో కలిసి పెప్సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెరిక కుల వసతి గృహం వ్యవస్థాపక సభ్యుడు ఏడ్మా నర్సింగరావు, పెప్సీ నాయకులు గుమ్మళ్ల మల్లికార్జున్, అప్పని సతీశ్‌కుమార్, ఆకా రాధాకృష్ణ, బేడుద వెంకటయ్య, శ్రీరామ్ వీరయ్య, మేడిశెట్టి శ్రీనివాస్‌రావు, బోళ్ల వీరప్రతాప్, సీనియర్ ప్రాత్రికేయుడు రాందేని చంద్రమౌళి, శ్రీరామ్ సత్యనారాయణ, బండి శ్రీకాంత్, అచ్చ పరమేశ్వర్, బగ్గని జనార్దన్, ముద్దసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
– ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9:

ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్‌గా ప్రొఫెసర్ కృష్ణయ్య

ప్రొఫెసర్ కృష్ణయ్యను అభినందిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్‌గా ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఆయన గతంలో విభాగం హెడ్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, ప్రెస్ జాయింట్ డైరెక్టర్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ తదితర బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (2020) ఆయనను వరించింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

కేటగిరీ-2 పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: కేటగిరీ-2 పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని నవ తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ (ఎన్‌టీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేటగిరీ-2 పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు యూజీసీ నెట్ అర్హత తొలగించాలని కోరారు. నెట్ నిబంధనతో పీహెచ్‌డీ చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు పరిశోధనలకు దూరమవుతారని అన్నారు. వర్సిటీ స్వయంప్రతిపత్తి సైతం దెబ్బతినే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా అనేక వర్సిటీలు స్వతంత్రంగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన పరిశోధన కేంద్రాలు, విద్యాసంస్థల్లో పని చేస్తున్న ప్రొఫెసర్లకు ఓయూలో గైడ్‌షిప్ ఇవ్వాలని కోరారు. 62 ఏళ్లలోపు పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్లకు గైడ్‌షిప్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. పరిశోధన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.20వేల ఫెలోషిప్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఎస్‌యూ నాయకులు కమలాకర్, శ్రవణ్, గోపాల్, నవీన్, బాలరాజ్, కార్తీక్, ఆనంద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

12న బ్రహ్మ కుమారీస్ ప్రత్యేక సదస్సు

బొల్లారం, జనవరి 9: ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవితం కోసం సమాజంలోని వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూర్చడమే లక్ష్యంగా బ్రహ్మకుమారీస్ పనిచేస్తుందని సికింద్రాబాద్ సబ్ జోన్ ప్రతినిధి బీకే మంజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12న సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారా సంబంధాలను మెరుగుపరచడం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రేరణాత్మక స్పీకర్ బీకే శివాని బెహన్జీ హాజరై సందేశాన్ని అందించనున్నారని పేర్కొన్నారు.

దివ్యాంగులకు 10వేల పెన్షన్ ఇవ్వాలి

చిక్కడపల్లి, జనవరి 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్(డీఎస్‌డీ) అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం కార్యాలయంలో ఉపాధ్యక్షులు భారతి, కాటమోని వెంకటేశ్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. దివ్యాంగులకు చట్టసభల్లో గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. తమ 41 డిమాండ్ల పరిష్కారం కోసం ఫిబ్రవరిలో ఢిల్లీలో దివ్యాంగుల ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో బధిరులు తరలి రావాలన్నారు. సమావేశంలో డీఎస్‌డీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌డీ వల్లభనేని ప్రసాద్

ఓయూలో కొనసాగుతున్న అంతర్జాతీయ సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9: ఓయూ హిందీ విభాగం, వివేకానంద ప్రభుత్వ కళాశాల, సీతాఫల్‌మండి ప్రభుత్వ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు రెండో రోజూ కొనసాగింది. ఆర్ట్స్ కళాశాలలో 'అనువాదం-మారుతున్న దృక్పథాలు-అభివృద్ధి చెందుతున్న అవకాశాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో అనువాద అంశాలపై చర్చించారు. డాక్టర్ కామేశ్వరి మాట్లాడుతూ సదస్సు ప్రాథమిక లక్ష్యాన్ని గురించి వివరించారు. అనువాదం యొక్క ప్రస్తుత దృక్పథాన్ని సభికులకు అర్థమయ్యేలా పేర్కొన్నారు. బీడీఎల్ ఉపాధ్యక్షుడు హోమనిధిశర్మ మాట్లాడుతూ సాంకేతిక రంగాల్లో అనువాదంతో సహ భాష వివిధ అనువర్తిత కోణాలపై ప్రసంగించారు. సాహిత్యం అనువాదంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన విశ్లేషించారు. డైలీ హిందీ మిలాప్ పత్రిక జర్నలిస్టు ఎఫ్ఎం సలీం మాట్లాడుతూ మీడియా రంగంలో అనువాదాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ఆయా సందర్భాల్లో భాష సహజత్వం, క్లుప్తత, కచ్చితత్వం పాటించాలని సూచించారు. టర్కీలోని ఇస్తాంబుల్ వర్సిటీ ప్రొఫెసర్ మహమ్మద్ రషీద్ వర్చువల్‌గా ప్రసంగిస్తూ భారతీయ అనువాద సాహిత్య సంపదను కొనియాడారు. చైనా బీజింగ్ ఫారెన్ స్టడీస్ వర్సిటీ ప్రొఫెసర్ వికాస్ కుమార్‌సింగ్ సైతం వర్చువల్‌గా ప్రసంగిస్తూ భారతీయ భాషల నుంచి చైనాకు పలు గ్రంథాలు అనువాదమయ్యాయని చెప్పారు. ఇటువంటి సదస్సు వల్ల మరిన్ని అనువాదాలు భవిష్యత్తులో జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నానాసాహెబ్ గోరె, రాజేంద్రప్రసాద్‌వర్మ, సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం, డాక్టర్ ప్రభు, డాక్టర్ అనుపమ, ప్రొఫెసర్ మాయాదేవి, డాక్టర్ సంగీతావ్యాస్, డాక్టర్ పంకజ్ మెహతా, డాక్టర్ సుధ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

అమీర్‌పేట్, జనవరి 9: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎవరి ఇళ్ల వద్ద వారు దాదాపు 400 మందికి పైగా మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో గురువారం విజేతల ఎంపిక జరిగింది. సనత్‌నగర్‌లోని స్వామి థియేటర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు వెల్లాల రామ్మోహన్, బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్‌తో కలిసి విజేతలకు బహుమతులను అందజేశారు. మొదటి స్థానంలో 29 మంది, ద్వితీయ స్థానంలో 57 మంది, తృతీయ స్థానంలో నిలిచిన 350 మంది మహిళలకు చీరలు అందజేశారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే

చిక్కడపల్లి, జనవరి 9: ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ సిబ్బంది గురువారం అశోక్‌నగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని బీఆర్ఎస్ నాయకుడు ఎస్టీప్రేమ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. సర్వే సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రేమ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులందరికీ ఇండ్లు అందించాలని అన్నారు.

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

బొల్లారం: డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ జి.రమేశ్ అన్నారు. గురువారం తిరుమలగిరి చౌరస్తాలోని అన్ అకాడమీ ఇనిస్టిట్యూట్‌లో సైబర్ మోసాలు, డ్రగ్స్, మహిళల భద్రతపై తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో కలిసి అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ డ్రగ్స్, మత్తుపదార్థాలు ప్రమాదకరమని, యువత వీటి బారిన పడకుండా భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడకుండా బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీ వివరాలు చెప్పొద్దన్నారు. కేవైసీ గడువు అయిపోయిందని మాయమాటలు చెప్పి మోసాలు చేస్తారని గుర్తుచేశారు. సైబర్ మోసాలకు గురైతే 1903 కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమలగిరి సీఐ నాగరాజు, ఎస్సైలు రాజశేఖర్ రెడ్డి, ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుమలగిరి రవాణా శాఖ అధికారి ఎర్ర స్వామి

బొల్లారం, జనవరి 9: హెల్మెట్ ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలని తిరుమలగిరి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎర్ర స్వామి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని లాల్‌బజార్ ప్రభుత్వ పాఠశాలలో ఆర్టీఓ స్వామి సిబ్బందితో కలిసి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదకరమని విద్యార్థులు తమ తల్లితండ్రులకు సూచించాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ చేస్తున్న ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో నరసింహ, నేహ, అవినాష్, లావణ్య, శ్రీహరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన ఆలయాలు

సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

నామాలగుండు వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

సికింద్రాబాద్, జనవరి 9: వైకుంఠ ఏకాదశి సందర్భంగా నామాలగుండులోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరగుతున్న ఏర్పాట్లను డీసీపీ బాలస్వామి పరిశీలించారు. పోలీసు అధికారుల బృందంతో పాటు పలువురు అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. వారితో పాటు స్థానిక కార్పొరేటర్ హేమ ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రతిఏటా ఘనంగా వైకుంఠ ఏకాదశి జరుపుకుంటామని ఈ సంవత్సరం భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉందన్నారు. కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ విఠలేశ్వర ఆలయంలో

మారేడ్‌పల్లి: రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జి.సత్యనారాయణ తెలిపారు. వేడుకలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఉదయం 5 గంటలకు నుంచి స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం తులసి అర్చనలు వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. 11న ఆలయ ఆవరణలో అన్నదానం ఉంటుందన్నారు. 13న ఉదయం 10 గంటలకు గోదాదేవి కళ్యాణోత్సవం జరుగనున్నట్లు తెలిపారు.

వెంకటేశ్వర ఆలయం ముస్తాబు

చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి సందర్భంగా అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణదేవి మాట్లాడుతూ శుక్రవారం జరిగే వైకుంఠ ఏకాదశికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. అన్ని శాఖల సహాయ సహకారంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

తిరుపతిలో తొక్కిసలాట జరిగిన సంఘటన నేపథ్యంలో చిక్కడపల్లి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని, ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతో పాటు తత్కాలికంగా మరిన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా 300 మంది వలంటీర్లను నియమించడంతో పాటు ప్రత్యేక డ్రెస్ కోడ్ కూడా ఉందన్నారు. భక్తులు కూడా క్యూలైన్లు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఇప్పటికే చిక్కడపల్లి ఏసీపీ ఆలయ పరిసరాలను పరిశీలించారని వెల్లడించారు.